క్లుప్తంగా

ఎంవీఐకి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: ఫిట్‌నెస్ టెస్టు చేయించకుండా తిప్పుతున్న స్కూల్, కాలేజీ బస్సులను తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ మంగళవారం ఎంవీఐ కంచె వేణుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేశబోయిన రాముయాదవ్, రాపెల్లి రోహిత్, లంక దాసరి రాహుల్, అభిలాశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని హోటల్, టీఫిన్ సెంటర్లు, బేకరి, వైన్‌షాపుల్లోని తినుబండరాలు, వాటిని తయారు చేసే ముడిసరుకుల నాణ్యతను మున్సిపల్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్, జవాన్స్ పాలకుర్తి అనిల్, రొంటాల సుధీర్, పాకాల రవీందర్‌రెడ్డి, వలిపాషా, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఉల్లంపల్లి గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలి

మంత్రి 'పొన్నం'కు గ్రామస్తుల వినతి

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి దాదాపు రెండు దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల బస్సు సౌకర్యం కోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రం ఇచ్చినట్లు కొత్తపల్లి సత్యనారాయణ, కోల సంపత్, విజయ్‌కుమార్, రజినీకాంత్, దినేశ్, పత్తెం బాలయ్య, బి. సంపత్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆఫీసులకు పని నిమిత్తం, విద్యార్థుల పైచదువులకు పట్టణ ప్రాంతాలకున్నా, ఉదయం కూలీలు, ఉద్యోగులు పనులకు వెళ్లేవారు బస్సుసౌకర్యం లేక ఆటోల్లో వెళ్తున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి రోడ్ వేయకపోగా బస్ సౌకర్యం కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అధికారులు గుంతలు లేకుండా మట్టితో రోడ్ మరమ్మతు చేశారని తెలిపారు. ఇప్పటికైనా హుస్నాబాద్ ఆర్టీసీ డీఎం గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ధర్నా, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సన్మానం



దంపతులను సన్మానిస్తున్న పీవీ సేవా సమితి, అలయన్స్ క్లబ్ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన రిటైర్డ్ పీడీ రాజిరెడ్డి దంపతులను హుజూరాబాద్ పీవీ సేవాసమితి, అలయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా శాలువాతో సత్కరించారు. రిటైర్డ్ పీడీ రాజిరెడ్డి ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా ఫిట్‌నెస్ కోచింగ్ ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవీ సేవాసమితి అలయన్స్ అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి, బి.మనోజ్, కౌన్సిలర్ స్వరూప ముత్యంరావు, సిద్ధార్థనగర్ కాలనీ అధ్యక్షుడు సాగి వీరభద్రరావు, ప్రధానకార్యదర్శులు టి.మాధవరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి



జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలో విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మూల ప్రభాకర్, పైడిపల్లి సంపత్ గేదెలు మంగళవారం మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లగా అక్కడ విద్యుత్ తీగలు కిందపడి ఉండటంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయని, లక్షల్లో నష్టం వాటిల్లిందని, కుటుంబ జీవనాధారం కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు, బాధితులు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు 'డబుల్' అడ్డా

- ఆయా గ్రామాల్లో ఇళ్లు నిర్మించినా కేటాయించని చేయని వైనం
- తలుపులు, కిటికీలు ధ్వంసం
- ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని కోరుతున్న ప్రజలు

వీణవంక: నిరుపేదలకు గూడు కట్టించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మండలంలోని కోర్కల్, పోతిరెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఇళ్లు నిర్మించారు. అయితే ఈ ఇళ్లు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. కోర్కల్ గ్రామంలో 40 ఇళ్లు మంజూరు కాగా పనులు దాదాపు పూర్తయ్యాయి. కానీ లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంతో మూడేళ్లుగా మూలనపడ్డాయి. ఇళ్ల చుట్టూ ముళ్ల కంచెలు ఏపుగా పెరిగాయి. భవనాలు శిథిలావస్థకు చేరడంతో పాటు తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. వీణవంక–చల్లూరు ప్రధాన రహదారి పక్కన నిర్మించిన ఇళ్లలో మందుబాబులు మద్యం తాగుతూ ఇళ్లలోనే సీసాలను పగలగొడుతున్నారు. అదేవిధంగా పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇరవై ఇళ్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. స్లాబ్‌లు పోసిన నాలుగు ఇళ్ల గోడలు కూలిపోయాయి. ఇక్కడ ఇళ్లు అడవిని తలపిస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేయించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు.

ఆకతాయిలపై నిఘా పెంచాలి..

డబుల్ బెడ్రూం ఇళ్లు మందుబాబులు, పేకా టరాయుళ్లకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా ఉండటంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పసిగట్టలేకపోతున్నారని, ఇప్పటికైనా గస్తీ నిర్వహించి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు అందించాలని కోరుతున్నారు.



కోర్కల్‌లో శిథిలావస్థలోకి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంట్లో తాగిపడేసిన మద్యం సీసాలు(ఇన్‌సెట్లో)

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన మానవుల పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు, ఆధ్యాత్మిక గురువు డాక్టర్ నాగుల సత్యంగౌడ్ రచించిన అహింస విశ్వమానవ కల్యాణం అనే కవిత సంకలనాన్ని రచించగా శామీర్‌పేటలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వార్థం వదులుకొని నవభారత నిర్మాణానికి పునాదిగా నిలవాలని కోరారు. యువత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని సంపత్‌గౌడ్, మంచిర్యాల రవి, విద్యావేత్తలు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వీణవంక: మండలంలోని ఘన్ముక్కల గ్రామంలో శ్రీభవానీశంకరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం అఖండ దీపారాధన, గణపతి గౌరీపూజ, స్వస్తి పూజ, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం పురవీధుల గుండా శివపార్వతుల విగ్రహాలను రథంపై ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జిన్నారపు శివకుమార్, ఆలయ అర్చకులు ఉన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, హాజరరైన భక్తులు

నిధులు మంజూరు చేయాలి

శంకరపట్నం: వేణుగోపాలస్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పురాతన కేశవపట్నం వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా చూడాలని మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి తక్షణం దేవాదాయశాఖ మంత్రితో మాట్లాడారు.

సమస్యలపై వాడీవేడి చర్చ

- ప్రత్యేకాధికారి గైర్హాజర్‌పై గ్రామసభలో నిరసన

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్ గైర్హాజర్‌పై గ్రామస్తులు నిరసన తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈసందర్భంగా రెండేళ్ల క్రితం పశువుల ఆసుపత్రి శిథిలావస్థలో ఉందని తక్షణం నూతన భవనం నిర్మించాలని తీర్మాణం చేసినా నేటికీ అమలు కాలేదని, అలాగే ఆరోగ్య ఉపకేంద్రం పనులు మధ్యలో ఆగిపోయాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, బీసీ కాలనీలకు మంజూరైన రెండు బోర్లను వేసి తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జీపీకి ప్రహరీ నిర్మించాలని, ఎస్సీ కాలనీలో హుజూరాబాద్ రోడ్ పక్క మురుగుకాలువను పూర్తిస్థాయిలో నిర్మించి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఊరచెరువులోని పంపుహౌస్ శిథిలాస్థలో ఉందని తక్షణం మరమ్మతు చేయాలని గ్రామసభలో చేసిన తీర్మానానికి ఆమోదం తెలిపారు. గ్రాంథాలయం కోసం నిర్మించిన భవనంలో బాలవికాస సంస్థ రక్షిత మంచినీటి పథకాన్ని పెట్టి ఐదేళ్లు గడిచినా ఖాళీ చేయడంలేదని గ్రామసభకు హాజరైన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ చేయించి గ్రంథాలయం ప్రారంభించాలని కోరారు. గ్రామసభలో ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, తాజా మాజీ సర్పంచ్ కె. భూంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల శారద సదానందం, ఫీల్డ్ అసిస్టెంట్ తాళ్లపల్లి సత్యం, కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మాచమల్ల రమణయ్య, బీజేపీ నాయకులు మాచమల్ల బుజ్జన్న, నరేందర్‌రెడ్డి, కత్తుల ప్రవీణ్ పాల్గొన్నారు.



బొమ్మనపల్లి గ్రామసభలో తీర్మానం ప్రవేశపెడుతున్న పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి

అనుమతి లేకుండా షెడ్డు నిర్మాణం



అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామ శివారులో గ్రానైట్ క్వారీకోసం గ్రామపంచాయతీ అనుమతి తీసుకోకుండా రేకుల షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. గిరిజాల గుట్ట వెనుక ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా జేసీబీతో మట్టిని తవ్వి గ్రామానికి చెందిన రైతు భూమిలోకి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అక్రమ నిర్మాణ విషయమై జీపీ కార్యదర్శి దేవికను వివరణ కోరగా అనుమతి కోసం గ్రామసభ నిర్వహిస్తామని, అక్రమంగా నిర్మాణం చేపడితే సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

మృతదేహానికి నాయకుల నివాళి



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు రేణుకుంట రామస్వామి అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రామస్వామి మృతదేహానికి నివాళి అర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందుబాటులో లేకపోవడంతో ఎంపీపీ జవ్వాజీ హరీశ్ ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు దహన సంస్కారాలకు రూ. పదివేల ఆర్థికసాయం అందజేశారు. సుంకె రవిశంకర్‌తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రామస్వామి మృతిపట్ల సంతాపం తెలిపారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, ఎంపీపీ సరోజన ఉన్నారు.

మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ రాజు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

తిమ్మాపూర్: పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. ఎల్ఎండీకాలనీ ఎస్సారెస్పీ గెస్టహౌస్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీరాజ్ ఏఈ, డీఈ,ఈఈ లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్లు, పెండింగ్ పనులు విషయంపై చర్చించారు. నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి అందిస్తే పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, రాష్ట్రంలోనే మానకొండూరును అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని, అధికారులు సైతం కష్టపడాలన్నారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు పంచాయతీరాజ్‌శాఖనే కీలకమని, రోడ్లతోపాటు అభివృద్ధి పనుల సమాచారం అందించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు

హుజూరాబాద్: సోషల్ మీడియాలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంత్రి స్కామ్‌లను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆధారాలతో చూపిస్తే జీర్ణించుకోలేక సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్మల శ్రీనివాస్, యాదగిరి నాయక్, వనితకుమార్, కుమారస్వామి, తిరుమల్‌రెడ్డి, రాజు, జీవితనరేష్, స్వప్నభాస్కర్, కిషన్, రమేశ్, రమాదేవి, మంజుల కృష్ణ, ఉజ్మా ఇమ్రాన్, సృజన పూర్ణచందర్, రాజకొమురమ్మ, తాళ్లపెల్లి శ్రీనివాస్, లావణ్య నరసింహారెడ్డి, ఉమాదేవి రమేశ్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

శంకరపట్నం: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీఓ శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారుల నుంచి తీసుకున్న ఆరుగ్యారంటీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో కొన్ని పొరపాట్లు జరిగినందున కొంతమంది లబ్ధిదారుల వివరాలు నమోదు కాలేదన్నారు. గృహజ్యోతి వివరాల నమోదులో కొంతమందిని అనర్హులుగా చూపెడుతుందన్నారు. లబ్ధి దారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.



ఎంపీడీవో శ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



పైపులతో పత్తి మొక్కలకు నీరు

కరీంనగర్‌రూరల్: వానాకాలంలో పత్తి సాగు చేసిన రైతులు వరుణుడి కరుణ కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. అప్పుడప్పుడు కురుస్తున్న చిరుజల్లులకు కొందరు రైతులు తొందరపడి పత్తి విత్తనాలను వేశారు. అయితే ఎండ తీవ్రతకు భూమిలో వేసిన విత్తనాలు మాడిపోతుండగా.. మొలకెత్తిన మొక్కలు ఎండిపోతున్నాయి. మంగళవారం గోపాల్‌పూర్‌కు చెందిన మహిళా రైతు మంద రాధ మొలకెత్తిన పత్తి మొక్కలను కాపాడుకునేందుకు మహారాష్ట్రలో అమలు చేస్తున్న రైయిన్ పైపు విధానాన్ని ఆశ్రయించింది. వారం రోజుల క్రితం గుంటూరుపల్లిలోని ఆరు ఎకరాల్లో పత్తి విత్తనాలను వేయగా.. ఇటీవల కురిసిన వర్షాలకు విత్తనాలు మొలకెత్తాయి. అయితే ఎండ వేడికి మొక్కలు వాడిపోతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాధ రైయిన్ పైపుల ద్వారా నీటి తడులను అందించారు.



త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి వంతెన నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో గ్రానైట్ లారీ గుంతలో కూరుకుపోయింది. హుజూరాబాద్ వైపు వెళ్తున్న ఉనుక లారీ తగులుతుందని గ్రానైట్ లారీ డ్రైవర్ రోడ్డు కిందికి లారీని దించడంతో మట్టిలో కూరుకుపోగా గ్రానైట్ కిందపడిపోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కేవీకే సందర్శన



జమ్మికుంట: పట్టణంలోని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) ను కరీంనగర్ దేశి సభ్యుల బృందం మంగళవారం సందర్శించారు. కిసాన్ సమ్మాన్ నిధులను మోదీ వర్చువల్‌గా విడుదల చేయగా ఆ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఫెసిలెటర్ రామచందర్‌రావు బోర్డు యాక్స్ మిశ్రమం, వానపాముల ఎరువుల తయారీ వివరించారు. వర్మీ వాష్, అజోళ్ల చేపల పెంపకం ప్రత్యక్షంగా వీక్షించారు. కార్య క్రమంలో రైతు శిక్షణ కేంద్రం డీడీఏ చత్రునాయక్, ఏవో మమత, దేశి బృందం సభ్యులు పాల్గొన్నారు.